సింగిల్ పేజీ కథ

# చిత్ర హింస

-కె.బి.కృష్ణ.

ఆ నగరంలో నాల్గుగు రోడ్ల కూడలిలో లక్షల ఖర్చుతో ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ మంత్రి విగ్రహం నిర్మించారు అది ఎవర్దో కాదు. నాదే!



నేనెప్పుడూ తిరిగే ఆ సెంటర్లో, నేను మహత్తరమైన రాజకీయ జీవితం గడిపిన ఆ నగరంలో అకాల మృత్యువాత పడ్డ నేను.. నా సహచరుల ప్రేమాభిమానాల పుణ్యమా అని ఆ విగ్రహంలో ప్రవేశించాను..

విగ్రహం పూర్తయిన రోజున నగర కమీషనర్ గారు వచ్చి నా కంచు విగ్రహం చూసి "అబ్బ ఎవరండీఈ శిల్పి? అచ్చు జీవకళ ఉట్టిపడ్తోందీ విగ్రహంలో!" అన్నారు.

అవును మరి! నేను విగ్రహంలో ప్రవేశిస్తే జీవకళ కాక ఏమవుతుంది? నా మీద టార్పాలిన్‌తో ముసుగు వేశారు. నా ముసుగు ఎప్పుడు తీస్తారా అని వాళ్ళ సంభాషణ వినసాగాను.

"మరి ఈ విగ్రహావిష్కరణ ప్రధాన మంత్రి గారితో చేయిస్తే బావుంటుంది. ఈయనేమో ప్రధాన మంత్రి గారికి బాగా సన్నిహితులుగా ఉండే వారుట కదా" అన్నారు ఒకరు.

గణపతి నవరాత్రులు వచ్చాయి. బ్యానర్లు కట్టడానికి నా నడుముకు ఒక కొబ్బరితాడు కట్టారు. నా పీకకు ఒక తాడు కట్టారు. ఇద్దరు చెరో ప్రక్కన నిలబడి బిగిస్తున్నారు. నాకు ఉక్కిబిక్కిరౌతోంది. ముసుగు తీసేస్తే నామెడకిలా తాళ్ళు కట్టరు. అప్పటి దాకా నేనోపిక పట్టాలి.. తప్పదు!

దేవీ నవరాత్రులు వచ్చాయి. పందిళ్ళు వేస్తూ నారెండు భుజాల మీద రెండు రాటలు వేసి. వాటీ సహాయంతో పందిరి వేశారు. పందిరి మీద ఎంత మందో ఎక్కి సర్దుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు. నన్ను ప్రజలు తమ భుజాలపై మోశారు సంతోషంతో. కానీ... ఇప్పుడు?

ప్రధానికి ఇప్పట్లో పర్యటనకు రావడం కుదర్దనీ, ముఖ్యమంత్రి గారి చేతనే ఆవిష్కరణ చేయిద్దామని నా ముసుగు తీశారు. రంగులు వేశారు. చాలా అందంగా ఉన్నాను. ఆయన రాలేదు!

ఆరోజు ఎవరో ఛోటా రాజకీయ నాయకుడు చనిపోయాడట. ఊరేగింపు నా విగ్రహం ముందు ఆగింది. బాంబులు పేలుస్తున్నారు. నాలుగైదు బాంబులు నాకు తగిలాయి. నేను పోయినా ఈ బాంబుల బాధ తప్పడం లేదు. విగ్రహం పెట్టక పోయినా నేను ఈ విగ్రహంలోకి వచ్చి ఉండే వాణ్ణి కాదు. కించిత్ బాధపడ్డాను.

ఒక రోజు కోతుల మంద వచ్చింది. ఒక కోతి నా ముసుగులో దూరింది. ఒక కోతి బయట ఉంది. వాటి శృంగారకేళితో నన్నవి ఛండాలం చేశాయి. ఈలోగా రెండు కాకులు నా నెత్తిన వాలి తీరిగ్గా కాల కృత్యాలు తీర్చుకున్నాయి!

ఈ రోజు ప్రధాని వస్తాడట. మళ్ళీ నా ముసుగు తీసి నాకు పెయింట్ వేశారు. కాని ఎందుకో మళ్ళీ ఆయన రాలేదు.

నాకు ఊపిరాడటం లేదు. మళ్ళీ నా నడుంకి. మెడకి తాళ్ళు బిగించి కడ్తున్నారు. నా ఆత్మ ఈ చిత్రవధని భరించలేకపోతోంది.

నేను సంచరించిన ప్రాంతమంతా దర్జాగా విగ్రహ రూపంలో చూడాలన్న నా కోరిక తీరేనా?

దూరంగా విద్యార్థులు పేడ ముద్దలతో వస్తున్నారు. ఏదో ఉద్యమం అనుకుంటా. నా ముఖాన కొట్టేట్టే ఉన్నారు. నా మిత్రుల కల్లోకి వెళ్ళి చెప్పాలి. ఇంకెక్కడా ఇక నా విగ్రహాలు పెట్టొద్దనీ... నన్నిలా సన్మానించొద్దనీ....

## రాజీవ్ హత్యపై చార్లెస్ శోభరాజ్ నవల

అంతర్జాతీయ నేరస్థుడు శోభరాజ్ ఒక చిత్రనిర్మాణ సంస్థకు తన ఆత్మకథ రాసిస్తున్నాడు. ఆ నవలలో 1976 నుండి 1984 వరకు జరిగిన రాజకీయ సంఘటనలే గాక, తను తీహార్ జైలునుండి పారిపోవడంకూడా ప్రస్తావిస్తున్నాడు. అలాగే రాజీవ్ హత్యపై కూడా నవల రాయదల్చానంటున్న శోభరాజ్ రచనలకోసం ప్రముఖ పబ్లిషర్స్ క్యూలు కడుతున్నారు. నిజమే ఎలా ప్రముఖుడైనా అతడి చేసేది విచిత్రమే స్మీ!

-రంజన